

ప్రాణాలతో చెలగాటం
దర్శి నగర పంచాయతీలో డంపింగ్ మొత్తం సాగర్ కాలువపైనే చేస్తుండటంతో సాగర్ నీరు కలుషితమవుతోంది.
- 8లో..



వైద్యశాల శానిటేషన్ సిబ్బంది సమ్మె
యర్రగొండపాలెం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో శానిటేషన్ సిబ్బంది జీతాలు ఇవ్వడం లేదంటూ సమ్మెకు దిగారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
35 /27

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ఒక్క మెడికల్ కాలేజీని తీసుకొచ్చావా చంద్రబాబు

- వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి



మొయిళ్ల గౌరి

ఒంగోలు టౌన్: 15 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా చేసినట్లు గొప్పలు చెప్పుకునే చంద్రబాబు పాలనలో కనీసం ఒక్క మెడికల్ కాలేజీని కూడా తీసుకురాలేదని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి విమర్శించారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ 2019కు ముందు మూడుసార్లు ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన చంద్రబాబు కనీసం ఒక్క మెడికల్ కాలేజీనైనా తీసుకొచ్చారా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం కాకుండా దోపిడీ వర్గాలకు లబ్ధి చేకూర్చేందుకే ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. జగనన్న ఐదేళ్ల పాలనలోనే రూ.8480 కోట్లతో 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి పూనుకున్నారని, అందులో 5 మెడికల్ కాలేజీలు నిర్మాణాలు పూర్తి చేసుకొని తరగతులు కూడా జరుగుతున్నాయని తెలిపారు. మిగిలిన కాలేజీలను పూర్తి చేయకుండా పీపీపీ పేరుతో ప్రైవేటు వ్యక్తులకు మెడికల్ కాలేజీలను అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేయడం సమర్థనీయం కాదన్నారు. జగనన్న పాలనలో వచ్చిన మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయడాన్ని రాష్ట్రంలోని మేధావులు కూడా వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. జగనన్న అధికారం చేపట్టే నాటికి రాష్ట్రంలో 2360 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా కొత్త కాలేజీల వలన సీట్లు పెరిగి 4910కు చేరాయని వివరించారు. మార్కాపురం మెడికల్ కాలేజీని పీపీపీకి అప్పగిస్తున్న కూటమి పాలకులు పులివెందుల మెడికల్ కాలేజీకి సీట్లు వద్దంటూ ఎన్ఎంసీకి లేఖ రాయడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


మార్కాపురం మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్వహించాలి



ఎస్‌కె మాబు (ఫైల్)

ఒంగోలు టౌన్: మార్కాపురం ప్రభుత్వ మెడికల్ కళాశాలను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆ పార్టీ సమావేశంలో కమిటీ తీసుకున్న నిర్ణయాలను ఆయన పత్రికలకు విడుదల చేశారు. మార్కాపురం ప్రభుత్వ వైద్య కళాశాలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మార్కాపురంలో వైద్య కళాశాలకు అవసరమైన 50.33 ఎకరాల స్థలాన్ని సేకరించారని, రూ.475 కోట్ల వ్యయ అంచనాతో 500 పడకలు, 150 మెడికల్ సీట్లుకు అనువుగా నిర్మాణం చేపట్టేందుకు మేఘా సంస్థ టెండర్ దక్కించుకుందని తెలిపారు. గత ఏడాది జూన్ నాటికి సుమారు 50 శాతం నిర్మాణాలను పూర్తి చేసుకుందని తెలిపారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ సూచనలకనుగుణంగా వైద్య కళాశాలకు అవసరమైన ఫేకల్టీని కూడా నియమించారని గుర్తు చేశారు. 2024 తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇక్కడ కేటాయించిన సిబ్బందిని బదిలీ చేసి నిర్మాణ పనులను కూడా నిలిపేసిందన్నారు. గత ప్రభుత్వం ఒప్పందం ప్రకారం ఐఆర్‌డీఎఫ్ నిధుల ద్వారా నిర్మాణం పూర్తి చేయాల్సి ఉండగా గడువుకు ముందే టెండర్‌ను రద్దు చేయడం, సిబ్బందిని బదిలీ చేయడం, పీపీపీ పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం వంటి ఏకపక్ష నిర్ణయాలను సీపీఎం జిల్లా కమిటీ వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్వహించాల్సిన వైద్య కళాశాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం వలన వైద్య విద్య పేదలకు దూరమవుతుందన్నారు.

గుండ్లకమ్మ రిజర్వాయర్ నుంచి నీరు విడుదల



గుండ్లకమ్మ రిజర్వాయర్ 7వ గేటు నుంచి నీరు విడుదల చేస్తున్న దృశ్యం

మద్దిపాడు: మండలంలోని మల్లవరం సమీపంలో ఉన్న కందుల ఓబుల రెడ్డి గుండ్లకమ్మ జలాశయం నుంచి నదిలోకి ఆదివారం రాత్రి నీటిని విడుదల చేశారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ నీటి సామర్థ్యం 3.84 టీఎంసీలు కాగా రిజర్వాయర్‌లో 3.80 టీఎంసీలను నిల్వ చేసి పైన వస్తున్న నీటిని 7వ నంబర్ గేటును 0.2 మీటర్లు ఎత్తి సుమారుగా 870 క్యూసెక్కుల నీరు గుండ్లకమ్మ నదిలోకి విడుదల చేసినట్లు ఏఈ రామాంజనేయులు తెలిపారు. గుండ్లకమ్మ నది పైభాగంలో రెండు రోజులుగా భారీగా వర్షాలు కురవడంతో జలాశయంలోకి ప్రస్తుతం 1110 క్యూసెక్కుల నీరు చేరుతోందని, ఇన్‌ఫ్లో ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఇన్‌ఫ్లో పెరిగితే మరికొన్ని గేట్లు ఎత్తి నీటిని నదిలోకి విడుదల చేస్తామని చెప్పారు.

గంజాయి కూత

గంజాయిపై ఉక్కుపాదం మోపుతాం.. అక్రమ రవాణా అరికడతాం అంటూ కూటమి పాలకులు ప్రగల్భాలు పలికారు..క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. విచ్చలవిడిగా గంజాయి అక్రమ రవాణా జరుగుతోంది. నిన్న మొన్నటి వరకూ కార్లలో, బస్సుల్లో తరలించే గంజాయి నేడు రైళ్లలో తరలించే స్థాయికి ఎదిగింది. ఒడిశా నుంచి తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు పలు రైళ్లలో తరలిపోతోందని తెలుస్తోంది. కొన్ని రోజులుగా రైళ్లలో గంజాయి తరలిస్తూ పట్టుబడడం పోలీసులకు సవాల్‌గా మారింది.



- పూరి–తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి రవాణా
- విశాఖ నుంచి తమిళనాడు, కేరళకు సరఫరా
- పూరి మినహా మిగతా రైళ్లలో తనిఖీలు నిల్
- నామమాత్రపు తనిఖీలతో ఈగల్ హడావుడి
- కూటమి పాలనలో పెరిగిపోయిన గంజాయి రవాణా
- వలస కార్మికులపై నిఘా పెట్టని పోలీసులు
- సోమవారం తనిఖీల్లో 15 కిలోల గంజాయి పట్టివేత

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

జిల్లాలో గంజాయి లభించని గ్రామం లేదంటే ఆశ్చర్యం కలగకమానదు. మండల కేంద్రాల్లోని పాఠశాలలు, ఆర్టీసీ బస్టాండులు, రైల్వే స్టేషన్లను అడ్డాగా చేసుకొని విక్రయాలు సాగుతున్నాయి. ప్రధానంగా ఇంజినీరింగ్ కళాశాలల పరిసరాల్లో విక్రయాలు జరుగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ప్రభుత్వం ఈగల్ పేరుతో ప్రత్యేక టీంను ఏర్పాటు చేసినప్పటికీ పెద్దగా ఫలితం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నూటికి నూరు శాతం గంజాయి సాగును అరికట్టినట్టు చెబుతున్న పాలకుల మాటలు పత్రికా ప్రకటనలకే పరిమితమయ్యాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పూరి ఎక్స్‌ప్రెస్ ద్వారా రవాణా...

కూటమి పాలకుల నిర్లక్ష్యం ఫలితంగా గంజాయి విక్రేతలు రైళ్లలో దర్జాగా తరలిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల కాలంలో పూరి నుంచి తిరుపతి వెళ్లే పూరి ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి రవాణా చేయడం ఎక్కువై పోయింది. ఒంగోలు రైల్వే స్టేషన్లో వరుసగా చేపట్టిన తనిఖీల్లో పూరి ఎక్స్‌ప్రెస్‌లో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జూలై నెలలో నిర్వహించిన తనిఖీల్లో మూడు కిలోల గంజాయి పట్టుబడింది. ఆ తరువాత ఆగస్టులో చేపట్టిన తనిఖీల్లో మళ్లీ మూడు కిలోల గంజాయి దొరికింది. ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఆగస్టు చివరలో మరోసారి తనిఖీలు నిర్వహించగా అప్పుడు కూడా అదే పూరి ఎక్స్‌ప్రెస్‌లో 4 కిలోల గంజాయి లభ్యమైంది. ఈ నెల 5వ తేదీన పూరి నుంచి తిరుపతి వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లో సింగరాయకొండ పరిసరాల్లోకి వచ్చిన తరువాత నిర్వహించిన తనిఖీల్లో 10 కిలోల గంజాయి పట్టుబట్టింది. చెన్నయ్‌కు చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. అదే ట్రైన్లో మరొక బోగీలో కిలో గంజాయి దొరికింది. తాజాగా సోమవారం నిర్వహించిన తనిఖీలో మరోసారి 15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పూరి–తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలో పోలీసు డాగ్ రాక్సీ గంజాయి వాసన పసిగట్టింది. గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు కేరళకు చెందిన ముజీబ్, ఒడిశా రాష్ట్రం బరంపురం జిల్లాకు చెందిన రేణుతోపాటుగా ఏడుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు.



సోమవారం పూరి ఎక్స్‌ప్రెస్‌లో పట్టుకున్న 15 కిలోల గంజాయి

విశాఖ పోలీసులు ఏం చేస్తున్నారో..

మూడు నెలల్లో వరసగా 5 సార్లు గంజాయి పట్టుబడింది. పోలీసులకు దొరికింది దాదాపుగా 50 కిలోల వరకు ఉంటుంది. ప్రధానంగా పూరీ ఎక్స్‌ప్రెస్ రైలును ఒంగోలు దాటిన తరువాత తనిఖీలు నిర్వహించినప్పుడు గంజాయి లభ్యమవుతుండడం గమనార్హం. ఒకటికి మూడు సార్లు ఈ ట్రైన్లో గంజాయి లభించినప్పటికీ విశాఖ రైల్వే పోలీసులు అప్రమత్తమైనట్లు కనిపించడంలేదు.

నిజానికి పూరి ఎక్స్‌ప్రెస్ విశాఖ మీదుగా వస్తుంది. అయితే అక్కడే దాన్ని కట్టడి చేస్తే అసలు సమస్య ఉండదు. ఒంగోలు పోలీసులు సైతం పూరి ఎక్స్‌ప్రెస్ పై మాత్రమే పోలీసులు నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. ఒడిశా, విశాఖ నుంచి వైపుల నుంచి వచ్చే మిగిలిన ట్రైన్లను పెద్దగా పట్టించుకుంటున్న దాఖలాలు లేవనే చెప్పాలి. పోలీసుల నామమాత్రపు తనిఖీలను ఆసరా చేసుకునే అక్రమార్కులు చెలరేగి పోతున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి.

జిల్లాలో గ్రామస్థాయిలో విక్రయాలు..

గతంలో పట్టణాలకు మాత్రమే పరిమితమైన గంజాయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామస్థాయికి చేరుకుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని అన్నీ మండలాల్లోనూ గంజాయి విక్రయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. జిల్లా కేంద్రమైన ఒంగోలు, చీమకుర్తి, సంతనూతలపాడు, పెళ్లూరు, మార్కాపురం, పొదిలి, గిద్దలూరు, కంభం, బేస్తవారిపేట, పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు ఎక్కువగా జరుగుతున్నట్లు సమాచారం. నిన్న మొన్నటి వరకు ఒంగోలు కేంద్రంగా జరిగిన గంజాయి వ్యాపారం ఇటీవల కాలంలో చీమకుర్తి, మద్దిచెట్టపాలెం గ్రామాలను అడ్డాగా చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఒడిశా నుంచి వచ్చే కార్మికుల ద్వారా, విశాఖ నుంచి వచ్చే మొలాసిస్ లారీల ద్వారా గంజాయిని తరలిస్తున్నట్లు తెలుస్తోంది.

విద్యార్థులు, కూలీలే లక్ష్యంగా విక్రయాలు...

ఇంజినీరింగ్, మెడికల్, డిగ్రీ కళాశాలలు, ప్రైవేటు కాలేజీలే లక్ష్యంగా గంజాయిని విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో పెళ్లూరు వద్ద ఉన్న ఒక ఇంజినీరింగ్ విద్యార్థి గంజాయిని విక్రయించడానికి ప్రయత్నించి పట్టుబడడం తెలిసిందే. ఒంగోలులోని ఒక కాలేజీ హాస్టల్ గదిని కొంతమంది విద్యార్థులు గంజాయికి అడ్డాగా మార్చుకున్నట్లు ప్రచారం జరగడం తెలిసిందే. మార్కాపురంలో ఇటీవల విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణలకు గంజాయి కూడా ఒక కారణమన్న వాదనలు వినిపించాయి. నగరంలోని ఒక స్టేడియం వద్ద కూడా గంజాయి వ్యాపారులు కాపు కాసి వ్యాపారం చేస్తున్నట్లు చెప్పుకుంటున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పక్కన బత్తుల బ్రహ్మానందరెడ్డి

ఒంగోలు సిటీ: జిల్లాలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం అనుబంధ విభాగాల అధ్యక్షులతో బూచేపల్లి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ మండల స్థాయి నుంచి అనుబంధ సంఘాలు పటిష్టంగా ఏర్పడాలన్నారు. అనుబంధ విభాగాల కమిటీలను పూర్తి చేసి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు. కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాడటానికి అనుబంధ సంఘాల నాయకులు సిద్ధంగా ఉండాలన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని, పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అందరికీ న్యాయం చేస్తామన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో అనుబంధ విభాగాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనుబంధ విభాగాల్లో ఉన్న నాయకులు సమర్థతతో పనిచేయాలన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ నిబద్ధతతో పని చేసిన నాయకులు, కార్యకర్తలకు పార్టీలో గుర్తింపు ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్నీ అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.



పాల్గొన్న వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు

ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక యాత్రలు

- 23వ తేదీ నుంచి జ్యోతిర్లింగ దక్షిణయాత్ర
- అక్టోబర్ 7వ తేదీ నుంచి భవ్య గుజరాత్ యాత్ర
- ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ ఎం.రాజు



యాత్ర ప్యాకేజీ కరపత్రాలను విడుదల చేస్తున్న ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ ఎం.రాజు తదితరులు

ఒంగోలు టౌన్: సీనియర్ సిటిజన్లు ఆధ్యాత్మిక ప్రాంతాలను తిలకించాలన్న కోరికను తీర్చేందుకు ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఆర్‌సీటీసీ) ఆధ్వర్యంలో ప్రత్యేక యాత్రా ఏర్పాట్లు చేసినట్లు ఆ సంస్థ ఏరియా మేనేజర్ ఎం.రాజు చెప్పారు. సోమవారం ఒంగోలు రైల్వే స్టేషన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన యాత్రా విశేషాలను వివరించారు. ఈ నెల 23వ తేదీ నుంచి జ్యోతిర్లింగ దివ్య దక్షిణ యాత్ర ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక రైలు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు మీదుగా తిరువణ్ణామలైలోని అరుణాచలం దేవాలయం, రామేశ్వరంలోని రామనాథస్వామి దేవాలయం, మధురై మీనాక్షి అమ్మన్ ఆలయం, కన్యాకుమారి రాక్ మెమోరియల్, భగవతి (కుమారి) అమ్మన్ ఆలయం, త్రివేంద్రంలోని పద్మనాభస్వామి ఆలయం, తంజావూరులోని బృహదీశ్వరాలయానికి 30వ తేదీకి చేరుకుంటుందని తెలిపారు. ఈ యాత్ర మొత్తం 7 రాత్రులు 8 రోజులు కొనసాగుతుందన్నారు. రూ.14,100 నుంచి టికెట్ ధర మొదలవుతుందని, థర్డ్ ఏసీ రూ.22,500, సెకండ్ ఏసీ రూ.29,500 ఉంటుందని తెలిపారు. అక్టోబర్ 7వ తేదీన తిరుపతి రేణిగుంటలో భవ్య గుజరాత్ యాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. ఇది నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, సికింద్రాబాద్ మీదుగా ప్రయాణిస్తుందన్నారు. ద్వారకాలోని ద్వారకాధీష్ ఆలయం, నాగేశ్వర్ టెంపుల్, ద్వారకా, సోమనాథ్‌లోని సోమనాథ్ ఆలయం, అహ్మదాబాద్‌లోని సబర్మతి ఆశ్రమం, మోధేరా సూర్య దేవాలయం, రాణికి వావ్, ఏక్తా నగర్లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహమైన స్టాట్యూ ఆఫ్ యూనిటీకి చేరుకుంటుందన్నారు. మొత్తం 9 రాత్రులు, 10 రోజుల పాటు యాత్ర కొనసాగుతుందని తెలిపారు. దీనికి స్లీపర్, థర్డ్ ఏసీ, సెకండ్ ఏసీ సౌకర్యం ఉందని, స్లీపర్ క్లాస్ పెద్దలకు రూ.18,400తో టికెట్ ప్రారంభమవుతుందన్నారు. థర్డ్ ఏసీ రూ.30,200, సెకండ్ ఏసీ రూ.39,900 ఉంటుందని వివరించారు. ఈ ప్యాకేజీలోనే ఉదయం టీ, అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజన వసతి ఉంటుందన్నారు. రైలులోని ప్రతి కోచ్‌లోనూ ఒక సెక్యూరిటీ గార్డు ఉంటారని, సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. వీటితోపాటుగా యాత్రలో ప్రదేశాల వద్దకు చేరుకునేందుకు ఎక్కడికక్కడ ప్రత్యేక బస్సు సౌకర్యం కూడా ఈ ప్యాకేజీలోనే ఏర్పాటు చేశామన్నారు. టికెట్ రిజర్వ్ చేసుకునేందుకు విజయవాడలోని ఐఆర్‌సీటీసీ నంబర్లు 9281495848, 9281030714కు ఫోన్ చేయాలని కోరారు. సమావేశంలో అసిస్టెంట్ మేనేజర్ జయంత్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి విధానాలపై ఉపాధ్యాయుల నిరసన



ప్రకాశం భవనం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

- ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు

ఒంగోలు సిటీ: విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసేలా కూటమి ప్రభుత్వం చేపడుతున్న విధానాలను నిరసిస్తూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రకాశం భవనం ఎదుట నిరసన చేపట్టారు. ఏపీటీఎఫ్ జోన్ కన్వీనర్ బీ శేషారావు అధ్యక్షతన నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి డీ శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న 4 డీఏలు వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, 12వ పీఆర్సీ కమిటీ వేయాలని కోరారు. సీపీఎస్ రద్దు చేసి, అన్ని రకాల బకాయిలు చెల్లించాలన్నారు. ఈహెచ్ఎస్ బకాయిలు రూ.25 లక్షలకు పెంచాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని చెప్పారు. నేడు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రకాశం భవనం ఎదుట నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో జిల్లా సబ్‌కమిటీ సభ్యులు శేఖరరెడ్డి, బషీరున్నీసా, అనిత, మండల శాఖ బాధ్యులు వీరరాఘవులు, మస్తాన్, మధు, మౌలాలి, టి.ఈశ్వరయ్య, రామారావు, సుబ్బయ్య, సుబ్బారావు, రామిరెడ్డి, శ్రీనివాసరావు, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

దొనకొండ (కురిచేడు): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రకాశం జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్ 14, అండర్ 17 బాల బాలికల నెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక నిర్వహించారు. ఈ సెలక్షన్స్‌కు జిల్లా స్థాయిలో వివిధ పాఠశాలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి అండర్ 14 లో బాలురు 12 మంది, బాలికలు 12 మంది, అండర్ 17 లో బాలురు 12 మంది, బాలికలు 12 మందిని ఎంపిక చేశారు. ఈ ఎంపికను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు అధ్యక్షతన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బీ మురళి నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు ప్రకాశం జిల్లా తరఫున రాష్ట్ర స్థాయిలో పాల్గొంటారని తెలిపారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా క్రీడాకారుల ఎంపిక



ఎస్‌జిఎఫ్ అండర్ 14,17 జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు



ఎస్‌జీఎఫ్ జిల్లా పోటీలకు తలపడుతున్న క్రీడాకారులు

ఒంగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14, 17 ఆర్చరీ జిల్లా జట్ల ఎంపిక సోమవారం స్థానిక ఏబీయం జూనియర్ కాలేజీ ఆవరణలో నిర్వహించారు. ఎంపిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏబీఎం జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ వాణి పాల్గొని క్రీడాకారులకు పలు సూచనలు చేశారు. అనంతరం క్రీడాకారులు విలువిద్య ప్రతిభ చాటుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి చక్కా వెంకటేశ్వర్లు, ఎంపిక కమిటీ జాతీయ న్యాయనిర్ణేత మేడికొండ జయలక్ష్మి, రావూరి మెర్సీ, ఆర్చరీ కోచ్ బత్తుల రాంబాబు, ఆర్చరీ జిల్లా కార్యదర్శి లెమ్యూల్ రాజు పాల్గొని పర్యవేక్షించారు

క్లుప్తంగా

గుంటూరులో హత్య.. గుండ్లకమ్మలో శవం!

మద్దిపాడు: గుంటూరులో హత్యకు గురైన వ్యక్తి ప్రకాశం జిల్లా మద్దిపాడు సమీపంలోని గుండ్లకమ్మ నదిలో శవమై తేలాడు. అందిన సమాచారం ప్రకారం.. వేముల రామాంజనేయులు(45) అనే వ్యక్తి కనిపించకపోవడంతో అతని భార్య గుంటూరులోని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు గుంటూరు పోలీసులు బండారు కొండయ్య అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా రామాంజనేయులును హత్య చేసి మద్దిపాడు మండలం వెల్లంపల్లి సమీపంలోని గుండ్లకమ్మ నది పక్కన పూడ్చివేసినట్లు అంగీకరించాడు. ఈ మేరకు గుంటూరు పోలీసులు సోమవారం రాత్రి 7:30 గంటల సమయంలో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు తరలించారు. గుంటూరు పోలీసులకు మద్దిపాడు ఎస్సై సైదులు తగిన సహకారం అందించారు.

మిద్దె ఎక్కుతూ జారి పడి మహిళ మృతి



ప్రమాద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

సీఎస్‌పురం(పామూరు): మిద్దె ఎక్కుతూ ప్రమాదవశాత్తు కాలు జారి పడి మహిళ మృతి చెందిన ఘటన సోమవారం సీఎస్‌పురం మండలంలోని వి.బైలు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై కథనం మేరకు.. వి.బైలు గ్రామానికి చెందిన బసివి లక్ష్మమ్మ(68) రాగులు ఎండబెట్టుకునేందుకు తమ మిద్దె మీదకు ఎక్కుతోంది. ఈ క్రమంలో కాలుజారి కింద పడడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆటోలో వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే లక్ష్మమ్మ మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుడు సుబ్బయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.వెంకటేశ్వరనాయక్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కనిగిరి వైద్యశాలకు తరలించారు. అప్పటివరకు తమతోనే ఉన్న లక్ష్మమ్మ ఊహించని రీతిలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

తొలి రోజే రాక్సీ సక్సెస్!

ఒంగోలు టౌన్: రాక్సీ.. బెల్జియం మాలినోయిస్ జాతికి చెందిన జాగిలం. సరిగ్గా 10 నెలల క్రితమే పోలీసు శాఖలో శిక్షణ కోసం చేరింది. వాసనను బట్టి గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను ఇట్టే పసిగట్టడంలో బహు నేర్పరి. సుశిక్షితుల తర్ఫీదులో మరిన్ని మెళకువలు నేర్చుకొంది. పట్టుదల, కసి మెండుగా ఉండే జాతికి చెందిన ఈ జాగిలం విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకొని విధుల్లో చేరింది. తొలి రోజే 15 కిలోల గంజాయి పట్టించింది. దీంతో పోలీసుల పని తేలిక కానుందని అధికారులు చెబుతున్నారు.



అక్రమ కేసులతో మీడియా స్వేచ్ఛకు ముప్పు



ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలాగా పనిచేసే మీడియాపై అక్రమ కేసులు పెట్టడం అంటే పత్రికా స్వేచ్ఛను హరించినట్లే. ప్రభుత్వం చేసే తప్పులు ఎత్తి చూపుతూ ప్రజా సమస్యలను పత్రికల ద్వారా వెలుగులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్న పాత్రికేయులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వమే వారిపై కేసులు పెట్టడం అన్యాయం. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్తంభమైన మీడియాకు పూర్తి స్వేచ్ఛ కల్పించాలి.

– భూతపాటి ఐజాక్, సీనియర్ న్యాయవాది, కంభం



విలేకర్లపై కేసులు తక్షణమే ఎత్తివేయాలి



ఉన్నది ఉన్నట్లుగా వార్తలు రాసిన జర్నలిస్టులపై కేసులు పెట్టి కక్ష సాధించాలనుకోవడం సరైన పద్ధతి కాదు. ప్రజలకు, పాలకులకు వారధులుగా, సమాజంలోని సమస్యలను వెలుగెత్తి చాటే విలేకర్లపై పెట్టిన కేసులు తక్షణమే ఎత్తేయాలి. సాక్షి పత్రికపై, విలేకర్లపై ఇటీవల పలు కేసులు నమోదు చేశారు. పత్రికల గొంతు నొక్కినంత మాత్రాన నిజం నిజంకాకుండా పోతుందా? నచ్చని అంశాలు ప్రచురితమైతే న్యాయ పరంగా పోరాటం చేయాలి. లేదంటే ఖండన ఇవ్వాలి. అంతే తప్ప పనిగట్టుకుని కేసులు పెట్టటం, అరెస్ట్ పేరుతో బెదిరించడం చెడు సంప్రదాయం. విలేకర్లపై పెట్టిన కేసులు వెంటనే ఎత్తి వేయాలి.

– ఉడుముల శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

ప్రాణాలతో చెలగాటం

- కలుషితమవుతున్న సాగర్ జలాలు
- దర్శి నగర పంచాయతీలోని డంపింగ్ మొత్తం సాగర్ కాలువ కట్టపైనే
- ప్రకాశం జిల్లాలోని పలు మండలాలకు, ఒంగోలు నగరానికి ఈ నీటినే సరఫరా
- తాగునీటి అవసరాలకు వినియోగిస్తున్న వైనం

దర్శి: పాలకులు, అధికారులు నిర్లక్ష్యం ఫలితంగా సాగర్ జలాలు కలుషితమవుతున్నాయి. ఆ నీళ్లు తాగిన ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. అయినా పట్టించుకోకుండా వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ప్రకాశం జిల్లా దర్శి నగర పంచాయతీలోని చెత్త, మురుగు, డంపింగ్ మొత్తం సాగర్ కాలువ కట్ట పైనే వేస్తున్నారు. శివరాజనగర్ కొండ పక్కన కాలువకు మధ్యలో ఈ డంపింగ్ చేస్తుండడంతో ఆ ప్రాంతం మొత్తం చెత్తతో కలసిపోయి కాలువ కట్టపైకి డంపింగ్ మొత్తం పేరుకుంటూ వచ్చింది. ఈ కాలువ కట్టవద్దకు వెళ్లాలంటే ఎవరైనా సరే ముక్కు మూసుకున్నా భరించలేని వాసన వెదజల్లుతోంది. వర్షం కురిస్తే ఆ చెత్తలో కుళ్లిన వ్యర్థాలు, మురుగు నీరు మొత్తం కొట్టుకుని పోయి సాగర్ కాలువలోకి నేరుగా వెళ్తున్నాయి. కాలువ పైన వేసిన డంపింగ్ వ్యర్థాలు సైతం కొట్టుకుని వచ్చి సాగర్ కాలువలో కలిసిపోతున్నాయి. దీంతో ఆ జలాలు పూర్తిగా కలుషితమవుతున్నాయి. ఈ సాగర్ జలాలను దర్శి నుంచి



సాగర్ కాలువ కట్టపై ఉన్న దూడ కళేబరం

ముండ్లమూరు, తాళ్లూరు, రామతీర్థం, చీమకుర్తి, సంతనూతల పాడు, ఒంగోలుకు నేరుగా తరలిస్తున్నారు. ఆయా మండలాల్లోని తాగునీటి చెరువులకు ఈ నీరు వెళుతోంది. దర్శి నియోజకవర్గంలో సుమారు రెండు లక్షల మందికి ఈ నీటిని



సాగర్ కాలువలోకి డంపింగ్‌లో నుంచి వెళ్తున్న మురుగు నీరు

కుళాయిలు ద్వారా సరఫరా చేసే ఎస్ఎస్‌పీ రిజర్వాయర్‌కు కూతవేటు దూరంలో ఈ డంపింగ్ ఉండడం గమనార్హం. అక్కడ పనిచేస్తున్న ఎస్ఎస్‌పీ సిబ్బంది సైతం మురుగు కంపు భరించలేక పోతున్నామని మేం చేసేదేం లేక ఆనీటిని అలాగే పంపింగ్ చేస్తున్నామని చెప్తున్నారు.



సాగర్ కాలువలో కలుస్తున్న డంపింగ్ వ్యర్థాలు, కవర్లు



సాగర్ కాలువ కట్టపైన ఉన్న నగర పంచాయతీలోని డంపింగ్ చెత్త వ్యర్థాలు



సాగర్ కాలువలో నీటిని మోటార్ల ద్వారా ఎస్ఎస్‌పీ రిజర్వాయర్‌కు పంపిణీ చేస్తున్న దృశ్యం

వైద్యశాల శానిటేషన్ సిబ్బంది సమ్మె



సమ్మె చేస్తున్న శానిటేషన్ సిబ్బంది శిబిరంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు రఫీ



అస్తవ్యస్తంగా ఉన్న బాలింతల వార్డు

- 7 నెలల నుంచి జీతాలు అందడంలేదని ఆవేదన
- ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో లోపించిన పారిశుద్ధ్యం
- ఆర్ఎంవో హామీతో విరమించిన సమ్మె
- ఈ నెల 19వ తేదీలోపు జీతాలు అందకుంటే నిరవధిక సమ్మె

యర్రగొండపాలెం: స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో శానిటేషన్ సిబ్బంది సోమవారం సమ్మెకు దిగారు. తమకు 7 నెలల నుంచి జీతాలు రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు అందకపోవడం వలన తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, తప్పని పరిస్థితుల్లో సమ్మె చేయాల్సి వచ్చిందని వారు తెలిపారు. తాము గత 11 నెలల నుంచి ప్రాంతీయ వైద్యశాలలో ఫస్ట్ ఆబ్జెక్టివ్ ఏజెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శానిటేషన్ సిబ్బందిగా చేరి వైద్యశాల పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్నామని, కరోనా కష్టకాలంలో కూడా మా ప్రాణాలు లెక్క చేయకుండా విధులు నిర్వర్తించామని వారు తెలిపారు. రెండేళ్ల క్రితం ప్రభుత్వం వైద్యశాలను 30 పడకల నుంచి 100 పడకల వైద్యశాలగా అప్‌గ్రేడ్ చేసిందని, అందుకు తగినట్లుగా శానిటేషన్ సిబ్బందిని పెంచకపోవడం వలన పనిభారం ఎక్కువైనా తాము కష్టపడి విధులు నిర్వర్తిస్తున్నామని వారు తెలిపారు. అను నిత్యం వైద్యశాల పరిశుభ్రతను కాపాడే తమకు 7 నెలల నుంచి జీతాలు ఇవ్వక పోవడం వలన తమ కుటుంబ పోషణ, నిర్వహణ చాలా ఇబ్బందిగా మారిందని, శానిటేషన్ సిబ్బందిలో వితంతువులు కూడా ఉన్నారని, తమ జీతాలతోనే జీవితాలు ముడిపడి ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నెల నెలా జీతాలు రాకపోవడంతో పాటు పీఎఫ్ బకాయిలు కూడా చెల్లించడం లేదని వారు ఆరోపించారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో తాము సమ్మె చేయాల్సి వచ్చిందని, వెంటనే జీతాలు, పీఎఫ్ బకాయిలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

అధ్వానంగా మారిన వైద్యశాల

శానిటేషన్ సిబ్బంది సమ్మెలో పాల్గొనడం వలన వైద్యశాలలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. రోగుల వార్డు చెత్త చెదారంతో నిండిపోయింది. వైద్యశాలలో అక్కడక్కడా నీళ్లు నిలువచేరి రోగులకు ఇబ్బంది కలిగించింది. డస్ట్‌బిన్‌లు శుభ్రం చేయకపోవడం వలన దుర్వాసన వెదజల్లుతోందని పలువురు రోగులు ఆరోపించారు.

నిరవధిక సమ్మెలోకి దిగాల్సి వస్తుంది

డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు వైద్యశాల ఆర్ఎంవో డాక్టర్ శివానంద శానిటేషన్ సిబ్బందితో చర్చలు జరిపారు. వైద్యశాలలో పారిశుద్ధ్యం పనులు కుంటుపడటం వలన రోగులతోపాటు తామందరం ఇబ్బందులు పడాల్సి వస్తుందని, తమకు రావాల్సిన జీతాలు త్వరలో అందచేసే బాధ్యతలను డీఎంహెచ్‌వో తీసుకున్నారని, సమ్మె విరమించి విధుల్లో చేరాలని ఆయన కోరారు. ఈ నెల 19వ తేదీలోపు జీతాలు అందకుంటే తమ సభ్యులు నిరవధిక సమ్మెలో దిగాల్సి వస్తుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ హెచ్చరించారు. ఆర్ఎంవో ఇచ్చిన హామీతో శానిటేషన్ సిబ్బంది సమ్మెను విరమించి విధుల్లో చేరారు.

మెడికల్ షాపు నిర్వాహకుడి ఆత్మహత్య

- అప్పులు.. అర్ధాంగితో మనస్పర్థలే కారణం
- ఒంగోలు పాత కూరగాయల మార్కెట్ వద్ద లాడ్జిలో ఘటన
- మృతుడిది నాగులుప్పలపాడు మండలం చవటపాలెం



ఆత్మహత్య చేసుకుని మరణించిన త్రినాథ్

ఒంగోలు టౌన్:



త్రినాథ్(ఫైల్)

నగరంలో మెడికల్ నిర్వహిస్తున్న ఓ యువకుడు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగులుప్పలపాడు మండలం చవటపాలెం గ్రామానికి చెందిన కట్టా త్రినాథ్ చౌదరి ఒంగోలు నగరంలోని నెల్లూరు బస్టాండు సెంటర్లో రమ్య మెడికల్స్ పేరుతో షాపు నిర్వహిస్తున్నాడు. అతడి భార్య సునీత అమెరికాలో ఎంఎస్ చదువుతోంది. మరికొన్ని రోజుల్లో త్రినాథ్ కూడా అమెరికా వెళ్లాల్సి ఉంది. అయితే ఆయనకు సుమారు 4 కోట్ల రుపాయల వరకు అప్పులు ఉన్నట్లు సమాచారం. గత కొన్ని రోజులుగా త్రినాథ్ హైదరాబాద్‌లో ఉంటున్నట్లు తెలుస్తోంది.

నాలుగు రోజుల క్రితం ఒంగోలు వచ్చిన ఆయన పాత కూరగాయల మార్కెట్ వద్ద గల ఒక లాడ్జిలో పైఅంతస్తులో దిగాడు. ఆదివారం రాత్రి గదిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మరణించాడు. ఎంతకూ బయటకు రాకపోయే సరికి లాడ్జి సిబ్బందికి అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి తలుపులు తెరచి చూడగా అప్పటికే మరణించి ఉన్నాడు.

భార్యతో మనస్పర్థలే కారణమా?

చవటపాలెం గ్రామానికి చెందిన త్రినాథ్ ఉప్పుగుండూరుకు చెందిన సునీతను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. 2022లో వివాహం కాగా ఏడాది క్రితం ఎంఎస్ చదవడానికి భార్య సునీతను అమెరికాకు పంపించాడు. ఆమెతోపాటుగా సునీత సోదరుడిని కూడా అమెరికాకు పంపించి చదివిస్తున్నాడు. ఈ క్రమంలో త్రినాథ్ అప్పు చేశాడు. అన్నీ సజావుగా ఉంటే మరికొన్ని రోజుల్లోనే తాను కూడా అమెరికా వెళ్లిపోవాలనుకున్నాడు. అయితే ఇటీవల కొంత కాలంగా భార్య సునీతకు త్రినాథ్‌కు మధ్య మనస్పర్థలు ఏర్పడినట్లు సమాచారం. దాంతో ఆమె త్రినాథ్ ఫోన్ నంబర్ బ్లాక్ చేసిందని, తనతో మాట్లాడటం పూర్తిగా మానేయడంతో మనోవేదనకు గురయ్యాడని సన్నిహితులు చెబుతున్నారు. ఈ విషయాన్ని స్నేహితులకు కూడా మెసేజ్ పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఒకవైపు అప్పుల తాలూకు ఒత్తిడి, మరోవైపు కట్టుకున్న భార్య దూరం కావడం భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. త్రినాథ్ తండ్రి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ నాగరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పట్టపగలే చైన్ స్నాచింగ్

- 3 సవర్ల బంగారం చోరీ



చోరీ తీరును వివరిస్తున్న యానాదమ్మ

సింగరాయకొండ: పట్టపగలు ఇద్దరు ఆగంతకులు బైక్‌పై వచ్చి ఓ వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు లాక్కుని ఉడాయించారు. ఈ సంఘటన సోమవారం సాయంత్రం సింగరాయకొండ మండలంలోని మూలగుంటపాడులోని గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం పెరల్ డిస్టిలరీ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్న రాయి బ్రహ్మయ్య తల్లి యానాదమ్మ మూలగుంటపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటి వద్ద నుంచి తాను నివాసముంటున్న విద్యానగర్‌లో అపార్టుమెంట్ వద్దకు వెళ్తున్నారు. అదే సమయంలో బైక్‌పై వేగంగా వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలోని సుమారు రూ.3 లక్షల విలువైన 3 సవర్ల బంగారు చైన్ లాక్కుని పరారయ్యారు. సంఘటనా స్థలాన్ని సీఐ హాజరత్తయ్య, ఎస్సై మహేంద్ర పరిశీలించారు. నిందితులు పంచాయతీ ఆఫీసు రోడ్డు గుండా ఆర్టీసీ బస్టాండ్ వైపు వెళ్లి అక్కడ నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా ఒంగోలు వైపు వెళ్లినట్లు సీసీ ఫుటేజ్‌లో పోలీసులు గుర్తించారు.

రైతు సంక్షేమాన్ని మరచిన కూటమి ప్రభుత్వం

- వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు ఇన్‌చార్జి మేరుగ నాగార్జున ధ్వజం
- చంద్రపాలెం, తక్కెళ్లపాడు, వేములపాడు గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ'



తక్కెళ్లపాడులో కూటమి మోసాలపై క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న మేరుగ నాగార్జున

సంతనూతలపాడు(చీమకుర్తి రూరల్): కూటమి ప్రభుత్వంలో రైతు ముఖంలో ఆనంధం కరువైందని, అభివృద్ధి సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం వదిలేసిందని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగ నాగార్జున విమర్శించారు. సోమవారం చంద్రపాలెం, తక్కెళ్లపాడు, వేములపాడు గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని మండల పార్టీ అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి అధ్యక్షతన వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మేరుగ నాగార్జున మాట్లాడుతూ.. రైతుల ముఖంలో ఆనందం చూడాలంటే వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం అవుతుందన్నారు. రైతన్నకు యూరియా అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, వైఎస్సార్ సీపీ పోరాటాలతోనే రైతులకు కొంత మేరైనా ధరలు, ఒకటీ అరా పథకాలైనా అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు మొసలి కన్నీరు కార్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వెన్నుపోటు పొడవటం చంద్రబాబుకు పరిపాటిగా మారిందని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రశ్నిస్తే అరెస్టులు అసత్య ప్రచారాలు, కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేయడంపై మండిపడ్డారు. కూటమి దౌర్జన్యాలకు, అరాచకాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలంటే రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగనన్నను సీఎంగా గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అనంతరం చంద్రపాలెం గ్రామ అధ్యక్షునిగా మనపాటి కిషోర్‌ని నియమించారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.విజయ నాగేశ్వరావు, దుంపా యలమందరెడ్డి, సర్పంచ్‌లు దర్శిగమణి, మైనం శైలజ అమరనాథ్, ఎంపీటీసీ నల్లూరి రాధ భాస్కరరావు, మాదాల వెంకటరావు, ఎం.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మొక్కుబడిగా మీ కోసం!

- పోలీస్ సిబ్బంది అతి, కొందరు ఉన్నతాధికారుల దురుసు వైఖరిపై అర్జీదారుల అసంతృప్తి

ఒంగోలు సబర్బన్: జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన మీ కోసం(పీజీఆర్ఎస్) కార్యక్రమం మొక్కుబడిగా సాగింది. కలెక్టర్ పి.రాజాబాబుకు సమస్యలు చెప్పుకొనేందుకు అర్జీదారులు భారీగా తరలివచ్చారు. అనివార్య కారణాలతో కలెక్టర్ మీ కోసంలో పాల్గొనకపోవడంతో జేసీ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్ఓ ఓబులేసు, డిప్యూటీ కలెక్టర్లు మాత్రమే అర్జీలు స్వీకరించారు. కలెక్టరేట్ పరిపాలనాధికారి రవికుమార్ అర్జీదారులను పట్టించుకోకుండా కాలు మీద కాలువేసుకొని కూర్చోవడంతో అర్జీదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మీ కోసం కాన్ఫరెన్స్ హాల్‌కు వెళ్లే సమయంలో పోలీసులు చెకింగ్ పేరుతో ఇబ్బంది పెట్టటం, తమదైన భాషలో మాట్లాడటంతో అర్జీదారులు నొచ్చుకున్నారు. వేదికపై కూర్చున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఇద్దరు.. ప్రజలతో అమర్యాదగా మాట్లాడటం, డీఆర్ఓ ఓబులేసు సైతం ఓ దశలో ఆగ్రహానికి గురై 'అర్జీలు ఇక్కడికెందుకు తేవడడం కోర్టులకు పోండి' అనడంతో గందరగోళం నెలకొంది. మొత్తం మీద కార్యక్రమాన్ని తూతూమంత్రంగా ముగించారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ



అర్జీదారుడిని పట్టించుకోకుండా కాలు మీద కాలేసి కూర్చున్న కలెక్టరేట్ ఏఓ రవికుమార్

మార్కాపురంలో ఇసుక దందా అరికట్టండి

- ధర్నాలో సీపీఎం నాయకుల డిమాండ్



ఇసుక దందాపై ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో కూటమి నేతల ఇసుక దందాను అరికట్టి భవన నిర్మాణదారులకు ఉచిత ఇసుకను అందుబాటులోకి తేవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దగ్గుబాటి సోమయ్య డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక హామీని కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరుతూ స్థానిక గడియార స్తంభం సెంటర్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా, నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. మార్కాపురం పట్టణ, పరిసర ప్రాంత ప్రజలకు ఇసుకను రూ.800కే లారీ యజమానులు సరఫరా చేస్తామంటున్నారన్నారు. అయితే కొంతమంది వ్యక్తులు లారీ యజమానులను బెదిరించి తమ టర్బో లారీలతోనే ఇసుకను డంపింగ్ చేసి టన్నుకు రూ.1300 నుంచి రూ.1400కు విక్రయించడం అన్యాయమన్నారు. లారీ యజమానులకు రూ.లక్షల్లో జరిమానా వేయించడం దారుణమన్నారు. మార్కాపురం ప్రాంతంలో ఉచిత ఇసుక అందని ద్రాక్షలా తయారైందని, 20 రంగాలకు పైగా కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. టన్ను ఇసుకను రూ.800కు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి రఫీ, మండల కార్యదర్శి జి.బాలనాగయ్య, నన్నేసా, రూబెన్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.